క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణాల కారణంగా విద్యుత్ స్తంభాలు మారుస్తున్నందున గురువారం స్థానిక బస్టాండ్ వద్ద నుంచి కోతిబొమ్మ సెంటర్ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎలక్ట్రికల్ డీఈ టి. రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గంగానమ్మ తల్లికి ఆషాఢ సారె



తోట్లవల్లూరు: వల్లూరుపాలెంలో గంగానమ్మ తల్లికి భక్తుల ఆషాఢ సారె సమర్పణ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన యార్లగడ్డ ఏసుబాబు, విద్యశ్రీ దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తులు బుధవారం ఆషాఢ సారె సమర్పించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు



తోట్లవల్లూరు: తోట్లవల్లూరు శివారు కలాసమాలపల్లికి వెళ్లే చిన్నకట్ట రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్లపొదల తొలగింపునకు గ్రామ పంచాయతీ చర్యలు తీసుకుంది. రోడ్డుకి ఇరువైపులా దట్టంగా ముళ్లపొదలు బాగా పెరిగిపోవటంతో రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సర్పంచ్ పెనుమత్స రాధిక దృష్టి సారించారు. ప్రత్యేకంగా కూలీలను ఏర్పాటు చేసి బుధవారం ముళ్లపొదలను తొలగించటంతో పాటు కలుపు నివారణ మందు పిచికారీ చేయించారు. పనులను పంచాయతీ కార్యదర్శి పుష్పనాథం, సిబ్బంది సునీల్ పర్యవేక్షించారు.

చెరువును తలపిస్తున్న రహదారి



పమిడిముక్కల: తాడంకి అండర్‌పాస్ వద్ద వర్షం నీరు నిలిచి రహదారి చెరువులా మారింది. ఈ ప్రాంతం పల్లంగా ఉండటంతో నీరు పోయే మార్గం లేక రోజులు తరబడి నిలిచి ఉంటోంది. వాహనదారులు నీటిలో అండర్‌పాస్ దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ తిరిగి రావాలంటే ఎక్కువ సమయం పడుతోందని, ఈ ప్రాంతంలో నీరు నిల్వ లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

డ్రెయిన్ నిర్మాణ పనులకు శ్రీకారం



ముదినేపల్లి రూరల్: స్థానిక గురజరోడ్డులో మురుగునీటి సమస్య పరిష్కారానికి సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. సర్పంచ్ ఎస్.కై కమ్మ ఈ పనులను ప్రారంభించారు. గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10.55 లక్షలతో ఈ డ్రెయిన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. 120 మీటర్ల పొడవు, 2.5 మీటర్ల వెడల్పున డ్రెయిన్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

గురుపౌర్ణమిని విజయవంతం చేయండి

కైకలూరు: గురుపౌర్ణమిని భక్తులు విజయవంతం చేయాలని షిరిడీ సాయిబాబా ధ్యానమందిర సేవా ట్రస్టు అధ్యక్షుడు కొనిజేటి శ్రీనివాసరావు కోరారు. ఈ నెల 21న సాయి మందిరం వద్ద గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం తొమ్మిది గంటలకు రుద్రహోమం, మహా మృత్యుంజయ హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 11 గంటలకు మహా అన్న సమారాధన, సాయంత్రం ఆరు గంటలకు పల్లకి సేవ నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అన్న సమారాధన

ముదినేపల్లి రూరల్: మండలంలోని దేవపూడి విజయదుర్గాంబ ఆలయం వద్ద బుధవారం అన్న సమారాధన నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా ప్రతిఏటా అమ్మవారికి సారెను సమర్పించి అన్న సమారాధన నిర్వహిస్తారు. అమ్మవారికి ఎడ్లబండిపై భక్తులు ఊరేగింపుగా సారెను తీసుకొచ్చి సమర్పించారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు



గుడ్లవల్లేరులో భక్తులకు దర్శనమిచ్చిన సత్యదేవుడు



ముదినేపల్లి మండలం వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పామర్రు: ఆషాఢ మాసం శుద్ధ ఏకాదశిని తొలిఏకాదశిగా భక్తులు జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో బుధవారం పలు వైష్ణవ ఆలయాల్లో విశేషంగా పూజాధికాలను చేశారు. స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆర్.ప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించామని ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధి జమీదగ్గుమిల్లిలోని శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయం, రాపర్ల గ్రామంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అలరించిన గీతాపారాయణ

శ్రీవేణుగోపాల భక్త భజన సమాజం సభ్యులు నిర్వహించిన గీతాపారాయణ, విష్ణు సహస్రనామ పారాయణ భక్తులను అలరించింది.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలోని ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలను బుధవారం వేద పండితులు నిర్వహించారు. గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయాల్లో స్వామివార్లకు వేకువజామునే అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు, అగ్ని హోత్రం ఫణిగోపాల్ విశేషాభిషేకాలను చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు వైష్ణవ ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో శ్రీసుభద్ర బలరామ సహిత జగన్నాథ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణ చేశారు. ఊటుకూరు శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి, ముదినేపల్లి పెదరామాలయం, సింగరాయపాలెంలోని కోదండరామాలయంలో ఏకాదశి నిర్వహించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: పట్టణంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. వైష్ణవ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక జగన్నాథపురంలోని శ్రీ భూనీలా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు వేదాంతం అప్పలాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి పూజలు నిర్వహించారు. భక్తులకు పూర్తి సౌకర్యాలు ఏర్పాటుచేశామని ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు.

కైకలూరులో..

కైకలూరు: తొలి ఏకాదశిని పురస్కరించుకుని పలు ఆలయాల్లో భక్తులు బుధవారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కై కలూరులో మీసాల వెంకటన్నస్వామిగా ప్రసిద్ధి చెందిన భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు. వెలంపేట గీతామందిరంలో ఏకాదశి పూజలు నిర్వహించారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి దర్శించుకున్నారు. ఏలూరు జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు అడపా శోభారాణి, పెద్దింట్లమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ బలే చిరంజీవి పాల్గొన్నారు.



కొల్లేటికోం పెద్దింట్లమ్మను దర్శించుకుంటున్న మాలతీరాణి



పామర్రు ఆలయంలో గీతా పారాయణ చేస్తున్న భక్తులు

మొక్కలు ప్రగతికి మెట్లు

కైకలూరు: మొక్కలు పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని, ప్రగతికి మెట్లని మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు పేర్కొన్నారు. స్థానిక ఎన్జీవోస్ కాలనీలో జెట్టి శ్యామ్ ఆర్థిక సాయంతో బుధవారం మొక్కలు నాటారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాణవాయువు ఆక్సిజన్ ఉత్పత్తికి ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షురాలు కొండ్రెడ్డి చిట్టెమ్మ, కార్యదర్శి ఎం.వెంకటసత్యనారాయణ, కోశాధికారి పాండురంగ విఠల్, జోనల్ ఇన్‌చార్జి కె.వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న మానవత సంస్థ సభ్యులు

నిలిచిపోయిన వర్షం నీటితో ఇక్కట్లు

మండవల్లి: స్థానిక సెంటర్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్అండ్‌బీ రహదారి వెంబడి నీరు నిలబడి ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. దీంతో నీరు రోడ్డు వెంబడి నిల్వ చేరిపోయింది. సమీపంలో ప్రాథమిక పాఠశాల–1 ఉంది. దీంతో స్కూల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికై నా సంబంధిత స్పందించి అధికారులు రహదారి వెంబడి నీరు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆర్అండ్‌బీ రోడ్డు వెంబడి నిలిచిపోయిన వర్షం నీరు

●ముమ్మరంగా వరి నాట్లు



పామర్రు మండలంలో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మండల పరిధిలో 23,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే ఐదు వేల ఎకరాల్లో నాట్లు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఎక్కువ శాతం వెద సాగును చేపట్టిన కారణంగా పనులు త్వరితగతిన జరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

–పామర్రు

క్యాంప్‌బెల్ కెనాల్‌కు నీరు విడుదల

ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రధానమైన క్యాంప్‌బెల్ కెనాల్‌కు సాగు, తాగునీటిని బుధవారం విడుదల చేశారు. ఎగువ నుంచి వస్తున్న నీటితో కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. కాలువ సామర్థ్యం 400 క్యూసెక్కులు కాగా ప్రస్తుతం 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ వడాలి సెక్షన్ ఏఈ బి.సిద్ధార్థ్ తెలిపారు. మండలంలోని ప్రధానమైన పోలరాజ్, క్యాంప్‌బెల్ కాలువలకు నీటిని విడుదల చేయడంతో తాగు, సాగు నీటి అవసరాలు తీరనున్నాయి.

తాగునీరు లేక అవస్థలు

మండవల్లి: సెంటర్‌లోని ఇళ్లకు 12 రోజుల నుంచి తాగునీరు లేక పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. నేషనల్ హైవే విస్తరణ పనులు జరుగుతుండడంతో వాటర్ ట్యాంక్ నుంచి మంచినీరు వచ్చే పైప్‌లైన్ కట్ చేశారు. దీంతో సుమారు 25 కుటుంబాలకు కుళాయిల ద్వారా తాగునీరు అందడం లేదు. సొమ్ములు చెల్లించి తాగునీటిని కొనుగోలు చేసి దాహార్తిని తీర్చుకుంటున్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు, సిబ్బందికి చెప్పినా పట్టించుకున్న దాఖలాలు లేవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై నా తాగునీరు సక్రమంగా అందేలా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక ప్రజావేదికలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పారిశుద్ధ్యం మెరుగునకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా డెంగీబారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నివాసాల మధ్య చెత్త పడేయవద్దని కోరారు. ప్రజలు క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలన్నారు.

దాడి ఘటనలో ఇద్దరికి గాయాలు

కె.కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కే.కొత్తపాలెం సెంటర్‌లో కొన్నేళ్ల కిందట వరికుప్పల దగ్ధం విషయమై ఇరువురు వ్యక్తుల మధ్య వివాదం ఘర్షణకు దారితీసింది. చల్లపల్లి సీఐ నాగప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. మత్తి రాంప్రసాద్, యత్తి యోగి మరి కొందరు సెంటర్‌లో కూర్చుని ఉన్నారు. కొన్నేళ్ల కిందట వరికుప్పల దగ్ధం విషయమై మాటా మాటా పెరిగింది. దీంతో రాంప్రసాద్‌ను యోగి కర్రతో కొట్టాడు. గాయపడిన రాంప్రసాద్ మోపిదేవి పోలీసులకు ఫిర్యాదు చేసి అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. ఈ విషయం విజయవాడలో ఉన్న రాంప్రసాద్ కుమారుడు శ్రీనివాసరావు తెలుసుకుని గ్రామానికి వచ్చాడు. గొడవకు చందన రంగారావు కారణమని భావించి తండ్రి, కుమారుడు ఇద్దరూ అవనిగడ్డ నుంచి గ్రామానికి వస్తున్న రంగారావుపై బండికోళ్లంక వద్ద కరకట్టపై దారికాచి కొట్టారని తెలిపారు. ఈ దాడిలో రంగారావు తలపై గాయం కావడంతో అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం మెరుగ్గానే ఉందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని పేర్కొన్నారు. ఈ గొడవలకు ఎలాంటి రాజకీయ కారణాలు లేవని, నిందితుడిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. విచారణ చేపట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా రాంప్రసాద్, యోగి వైఎస్సార్ సీపీ, టీడీపీలకు చెందినవారు కావడంతో వివాదం రాజకీయరంగు పులుముకుంది.



కేసు వివరాలు చెబుతున్న సీఐ నాగప్రసాద్, ఎస్ఐ సత్యనారాయణ

రోడ్డు విస్తరణ పనులు అస్తవ్యస్తం



మండవల్లి: మండవల్లిలో రోడ్డు విస్తరణ పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. స్థానిక సెంటర్‌లో చెరువును పోలిన గుంతలు తవ్వి సుమారు 15 రోజుల నుంచి రోడ్డు విస్తరణ కాంట్రాక్ట్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో గుంతలు చెరువుల మాదిరిగా మారాయి. ఇటీవల కురిసిన వర్షానికి గుంతల్లో వర్షం నీరు నిలిచి సెంటర్‌కు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెడికల్ షాపునకు వచ్చే జనం రాకపోకలు సాగించడానికి అవకాశం లేక అవస్థలు పడుతున్నారు.

త్యాగాలకు ప్రతీక మొహర్రం



మొవ్వ మండలం కాజలో పీర్లు ఊరేగిస్తున్న ముస్లింలు



గుడ్లవల్లేరు మండలం తురాయిపాలెంలో పీర్ల ఊరేగింపు



గుడివాడలో పీర్లు ఊరేగిస్తున్న ముస్లింలు



ఐలూరులో పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

గుడివాడ టౌన్: మండలంలో త్యాగాలకు ప్రతీక అయిన మొహర్రంను ముస్లింలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త మనుమడు హజరత్ ఇమామ్ హుస్సేన్ బలిదానానికి గుర్తుగా మొహర్రం నిర్వహిస్తామని పేర్కొన్నారు. మొహర్రం దుఃఖదినంగా భావిస్తామని తెలిపారు. ఇస్లామియా నూతన సంవత్సరం మొదటి 10 రోజులు విషాధ దినాలుగా ఆచరిస్తామన్నారు. ఈ 10 రోజులు ఏ విధమైన శుభకార్యాలు నిర్వహించబోమని తెలిపారు. 11వ రోజు ఉపవాసం ఉంటారన్నారు. మొహర్రం పురస్కరించుకుని పట్టణంలో పీర్లు ఊరేగించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మొహర్రం పురస్కరించుకుని గుడ్లవల్లేరు మండలంలోని తురాయిపాలెం, కౌతవరంలో పీర్ల ఊరేగింపును బుధవారం చేపట్టారు. ధర్మం కోసం మహ్మద్ ప్రవక్త అన్యాయాలు, అక్రమాలను వ్యతిరేకించారని పఠాన్ బషీర్ ఖాన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇస్మాయిల్ ఖాన్, సలాం ఖాన్, ఆసిఫ్ ఖాన్, జానూ ఖాన్, బుడ, చాన్ బాషా పాల్గొన్నారు.

అలీనఖీపాలెంలో చెస్ట్‌బీటింగ్

పమిడిముక్కల: మండలంలోని అలీనఖీపాలెంలో గ్రామంలో హజరత్ ఇమామ్ హుస్సేన్ వర్ధంతి సందర్భంగా రెండు మసీదుల్లో ముస్లింలు చెస్ట్‌బీటింగ్ నిర్వహించారు. రక్తం చిందించి కర్బలా అమరవీరులకు నివాళులర్పించారు. గ్రామంలో పీర్లను ఊరేగించారు. గధీర్ సొసైటీ, హుస్సేనీ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మొహర్రం అంటే పండుగ కాదని దుఃఖ దినాలని మత గురువులు పేర్కొన్నారు. గధీర్ సొసైటీలో జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మన్ షా జవాద్ అలీ, అధ్యక్షుడు ఖాసిం అలీ, కార్యదర్శి అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు. సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ శ్రీనివాస్ శాంతి భద్రతలు పర్యవేక్షించారు. వీరంకిలాకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలందించారు.

మొవ్వలో..

కాజ(మొవ్వ): మొహర్రం సందర్భంగా బుధవారం ముస్లింలు పీర్లు ఊరేగించి వీరులకు నివాళులర్పించారు. మొవ్వ మండలంలోని కాజ, భట్లపెనుమర్రు, నిడుమోలు గ్రామాల్లోని పీర్లు ఊరేగించారు. కాజ గ్రామంలో సయ్యద్ మతిన్, షేక్ ఇస్మాయిల్, షేక్ ఇబ్రహీం, ఎండీ బహదూర్ అలీ, అబ్దుల్ రషీద్ తదితరులు పీర్ల ఊరేగింపు నిర్వహించారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: ఇమాం హుస్సేన్ త్యాగానికి ప్రతీకగా మండలంలోని వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, ఐలూరు గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరిపి మొహర్రంను జరుపుకున్నారు. ఐలూరులో మంగళవారం రాత్రి నిప్పుల గుండం తొక్కటంతో పాటు బుధవారం ఉదయం చెస్ట్ బీటింగ్, సాయంత్రం గ్రామంలో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. ముస్లిం పెద్దలు షేక్ జబ్బార్, అమీర్‌ఖాన్, రషీద్, హమీద్ పాల్గొన్నారు.



అలీనఖీపాలెంలో చెస్ట్‌బీటింగ్

గురు భక్తికి ప్రతీక ఏకలవ్యుడు

కైకలూరు: ఏకలవ్యుడు గురు భక్తికి ప్రతీకగా నిలుస్తాడని పలువురు వ్యక్తులు కొనియాడారు. కలిదిండి సెంటర్‌లో ఏకలవ్యుడి విగ్రహం వద్ద నియోజకవర్గ ఏకలవ్య సంఘం అధ్యక్షుడు కుంభా నాగరాజు అధ్యక్షతన జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. కూటమి నాయకులు పోకల జోగిరాజు, వల్లభనేని శ్రీనివాస చౌదరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏకలవ్య విగ్రహానికి పాలాభిషేకం చేసి, మిఠాయిలు పంచారు. సంఘ నాయకులు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఏకలవ్యులకు ఎస్టీ కోటాలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న విధంగా మండల స్థాయిలోనూ ఆ పద్ధతి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.దినతేజ్, సంఘ నాయకులు కోడడి శ్రీను, దాసు, దానియేలు పాల్గొన్నారు.



ఏకలవ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

స్తంభాన్ని ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

గూడూరు: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై గూడూరు మండలం రామరాజుపాలెం అడ్డరోడ్డు దగ్గర బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు మచిలీపట్నం పరాసుపేటకు చెందిన టి.బి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం (48) నందిగామలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. బంధువుల ఇంట్లో కార్యక్రమం ఉండటంతో నందిగామ నుంచి కారులో బయలుదేరాడు. మార్గమధ్యంలో ఉయ్యూరులో బంధువులను ఎక్కించుకుని బందరు వెళ్తున్నాడు. రామరాజుపాలెం అడ్డరోడ్డు దగ్గర రోడ్డు దాటుతున్న గేదెలను తప్పించే క్రమంలో అదుపుతప్పిన కారు, గేదెల పక్కన నడిచి వస్తున్న గొరిపర్తి కృష్ణమూర్తిని ఢీకొని విద్యుత్ స్తంభానికి గుద్దకుని ఆగిపోయింది. ఈ ప్రమాదంలో కృష్ణమూర్తికి స్వల్పగాయాలయ్యాయి. కారు నడుపుతున్న సుబ్రహ్మణ్యం తలకు బలమైన గాయాలయ్యాయి. 108లో సుబ్రహ్మణ్యంను బందరు ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో కారులో సుబ్రహ్మణ్యం మరదలు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరు సురక్షితంగా బయటపడ్డారు.



రామరాజుపాలెం అడ్డరోడ్డు దగ్గర అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు